స్వచ్ఛందంగా అంగీకారం

దుద్యాల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు లగచర్ల గ్రామానికి చెందిన రైతు ఈర్లపల్లి అంజిలమ్మ ముందుకు వచ్చింది. తన భూమికి సంబంధించి అంగీకారపత్రాన్ని శనివారం తహసీల్దార్ కిషన్‌నాయక్‌కు అందించింది. ఆమె వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, శ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్ ఖాజ ఉన్నారు.

న్యాయవాదులకు అవగాహన తరగతులు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి

వికారాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రెండు రోజుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సున్నం శ్రీనివాస్ రెడ్డి శనివారం ప్రారంభించారు. పారా లీగల్ వలంటీర్స్, న్యాయ సేవా ప్యానల్ న్యాయవాదులకు శిక్షణ ఇచ్చారు. సమాజంలో పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పిల్లలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆత్మహత్యలకు దారి తీసే కారణాలు, వాటి నివారణకు సంబంధించిన అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ షీతల్, జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జూనియర్ న్యాయమూర్తి శ్రీకాంత్, అదనపు జూనియర్ న్యాయమూర్తి శృతిదూత, లీగల్ ఎడ్ న్యాయవాదులు వెంకటేశ్, రాము, శ్రీనివాస్, బాలయ్య, నాగరాజు, నర్సింహులు, యాదగిరి, పారా లీగల్ వలంటీర్స్ పాల్గొన్నారు.

అర్హులు ఎందరో!

రేషన్‌కార్డుల జారీకి కొనసాగుతున్న సర్వే

- క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపు
- నేటితో ముగియనున్న ప్రక్రియ
- జాబితాలో పేరు లేకపోతే మళ్లీ దరఖాస్తుకు అవకాశం
- ఈనెల 26న కొత్త కార్డులు జారీ

కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురు చూస్తున్న పేదల నిరీక్షణకు త్వరలోనే తెరపడనుంది. కార్డుల జారీకి అర్హుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. గతేడాది నిర్వహించిన సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన నివేదిక ఆధారంగా జాబితాను రూపొందించారు. జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 23,542 దరఖాస్తులను ప్రాథమికంగా అర్హత ఉన్నట్లుగా గుర్తించారు. ఇందులో 17,492 దరఖాస్తుల పరిశీలన క్షేత్రస్థాయిలో పూర్తికాగా, మండలాల వారీగా అర్హుల జాబితాను రూపొందించారు. వీటిని గ్రామాల వారీగా విభజించి పంచాయతీ కార్యదర్శులకు పంపించారు. అర్హుల ఎంపికపై ఈ నెల 16న ప్రారంభమైన క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ ఈ నెల 20 వరకు పూర్తి కానుంది.

వికారాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ప్రస్తుతం 2,41,179 రేషన్ కార్డులు ఉండగా 8,09,218 మంది సభ్యులు ఉన్నారు. స్వరాష్ట్రం ఏర్పాటైన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 2018, 2022లో అర్హులుగా గుర్తించిన వారిలో కొందరికి మాత్రమే ఆహార భద్రత కార్డులు జారీ చేశారు. మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినప్పుడు కొందరు రేషన్ కార్డులకు, మరికొందరు మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలోనూ కొందరు తెల్ల కాగితాలపై రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేశారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక ఆర్థిక, కుల గణన సర్వేలో ప్రజలు రేషన్ కార్డులు కావాలంటూ దరఖాస్తు పెట్టుకున్నారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన సర్వే ఆధారంగా ఉన్నతాధికారులు 360 సాఫ్ట్‌వేర్ సాంకేతికతను ఉపయోగించి

- మిగతా 8వ పేజీలో..



జిల్లాలో రేషన్ కార్డులు
2,41,179

కొత్తగా వచ్చిన దరఖాస్తులు
23,542

పరిశీలన పూర్తయినవి
17,492

అక్రమ రవాణాను అడ్డుకుంటాం

ఎస్పీ నారాయణరెడ్డి



వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో పట్టుబడిన టిప్పర్లు

వికారాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మట్టి, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుక, ఎర్రమట్టిని రవాణా చేస్తున్న ఎనిమిది మందిని టాస్క్‌ఫోర్స్ అధికారులు అదుపులోకి తీసుకున్నారని వెల్లడించారు. నమ్మదగిన సమాచారంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. వికారాబాద్ పరిధిలోని ధన్నారం గుట్ట వద్ద అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు జరుపుతుండగా ఐదుగురిని అదుపులోకి తీసుకొని మూడు ఎర్రమట్టి లోడ్ చేసిన టిప్పర్లు, ఒక జేసీబీ, ఒక కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తాండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక ట్రాక్టర్, దాని డ్రైవర్, యాలాల పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు ట్రాకర్లు, ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు.

నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

పరిగి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. శనివారం పరిగి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కొంతకాలంగా పరిగిలో జరుగుతున్న దొంగతనాలు, వాటిని చేధించడంలో జరుగుతున్న జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు సంతోష్, కృష్ణ, సిబ్బంది ఉన్నారు.

కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ.120 కోట్లు

- నియోజకవర్గానికి 12 వేల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

ధారూరు, జనవరి 18: కోట్‌పల్లి ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.120 కోట్లు, వికారాబాద్ నియోజకవర్గానికి 12 వేల ఇళ్లు మంజూరయ్యాయని శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు. మండలంలోని కుక్కింద, నాగారం, దోర్నాల్, స్టేషన్ ధారూరు, ధారూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను శనివారం ప్రారంభించారు. మండల మహిళా సమాఖ్య భవనంలో 56 మందికి వివిధ పథకాల కింద మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ కోట్‌పల్లికి సంబంధించి కాల్వలు, చెక్ డ్యాంలకు మరమ్మతులు చేపడుతామని పేర్కొన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, గ్రామాల్లో సర్వే చేసి రేషన్ కార్డులు అందిస్తామని చెప్పారు. జనవరి 26 నుంచి రైతు భరోసా కింద రైతులకు, రైతు కూలీలకు రూ. 12 వేలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. సాంకేతిక, ఇతర కారణాలతో కొంతమందికి రుణమాఫీ కాలేదని, వారందరికీ రుణమాఫీని వర్తింప జేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ హయాంలో ధరణి పోర్టల్‌తో రైతులు అవస్థలు పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చే భూభారతి చట్టంతో భూ సమస్యలు తొలిగిపోతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, వైస్ చెర్మన్ అశోక్ ముదిరాజ్, పీఏసీఎస్ చెర్మన్ సత్యనారాయణరెడ్డి, వాలీబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాములు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలి

వికారాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అందరూ సహకరించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కోరారు. శనివారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్వాసితులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల అభిప్రాయం మేరకే భూ సేకరణ చేపడుతామని, బ్రిడ్జి నిర్మాణంలో ఇళ్లు, స్థలాలు కొల్పోతున్న నిర్వాసితులకు ఎలాంటి నష్టం జరుగకుండా పరిహారం అందించి న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, నాయకులు విశ్వనాథం సత్యనారాయణ, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధారూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్

మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిర్మూలనను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్, విద్యాశాఖ, వ్యవసాయ, పోలీస్, వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందదర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. ఇందులో మహిళా సంఘాలు, అంగన్‌వాడీ టీచర్లు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని సూచించారు. విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల వాడకం వల్ల జరిగే దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పంటపొలాల్లో గంజాయి సాగు చేస్తున్నారా, లేదా అని పరిశీలించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. గంజాయి రవాణాను అడ్డుకునేందుకు పోలీస్ యంత్రాంగం ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అదనపు ఎస్పీ హన్మంత్‌రెడ్డి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, డీఈవో రేణుకాదేవి, డీఎంహెచ్‌వో వెంకటరమణ, డీసీహెచ్‌వో ప్రదీప్, డీవైఎస్‌వో హన్మంత్‌రావు, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి శంకర్‌నాయక్, అటవీ శాఖ రేంజ్ ఆఫీసర్ శ్యాంకుమార్ పాల్గొన్నారు.



వికారాబాద్‌లోని రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రంలో పాడైన మిషన్లు

ప్రైవేట్‌లో రక్తపరీక్షలు చేయిస్తున్నాం



"చేవెళ్లలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నాను. ఇక్కడ ల్యాబ్‌లో రక్త నమూనాలు ఇచ్చాను. వికారాబాద్‌లోని టీహబ్‌కు రక్త నమూనాలు పంపించారు. అక్కడ యంత్రం పనిచేయడం లేదు. బయట ప్రైవేట్‌గా టెస్టులు చేయిస్తున్నాను. రూ. 1500 వరకు ఖర్చు వస్తుంది. రోజు తప్పించి రోజు చేవెళ్లకు రావాల్సి వస్తుంది. వికారాబాద్‌లో డయాలసిస్ యంత్రాలు తక్కువగా ఉండటంతో ఇక్కడికి వస్తున్నాను. రవాణా చార్జీలు తడిసి మోపడవుతున్నాయి.
- ముక్తార్ అహ్మద్, డయాలసిస్ పేషెంట్, దోర్నాల్ గ్రామం, ధారూర్ మండలం

రోగ నిర్ధారణకు పరీక్ష!

వికారాబాద్ డయాగ్నోస్టిక్ హబ్‌కు జబ్బు

- పాడైన యంత్రాలు.. పట్టించుకోని అధికారులు
- ప్రత్యామ్నాయం మార్గం లేక రోగుల ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లాలో పేదలకు తప్పని రక్త పరీక్షల భారం
- ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న డయాలసిస్ పేషెంట్లు

రంగారెడ్డి అర్బన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్య ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) పథకంలో భాగంగా తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ సేవలు 2018 జనవరిలో ప్రారంభమయ్యాయి. తొలుత హైదరాబాద్‌కే పరిమితమైన ఈ సేవలను ఆ తర్వాత అన్ని జిల్లాలకు విస్తరించాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని నిరుపేదలకు వైద్య పరీక్షల భారాన్ని తగ్గించేందుకు ఏర్పాటైన తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌కు జబ్బు చేసింది. వీటి పనితీరు అస్తవ్యస్తంగా మారింది. తరచూ యంత్రాలు మొరాయిస్తున్నాయి. గత 12 రోజుల నుంచి హబ్‌లో యంత్రాలు పని చేయడం లేవు. ఒకే మిషన్ ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక మిషన్ పాడైతే.. మరో మిషన్ లేదు. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడం.. ఉన్న మిషన్‌నే మరమ్మతులు చేయించడం.. మరమ్మతుల కోసం సుమారు 15 రోజులు పట్టడంతో రోగులు ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో రోగులు అల్లాడుతున్నారు.

పేదలకు రక్త పరీక్షల భారం తీరటం లేదు.. ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి వేల రూపాయలు ఖర్చు చేయక తప్పడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల టెస్టులు అందని ద్రాక్షలా మారింది. తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ పేరుతో సర్కారు వికారాబాద్ జిల్లా కేంద్రంలోకి అందుబాటులోకి తీసుకు వచ్చింది. ఈ కేంద్రం ద్వారా ఒకే సారి 57 రకాల రక్త, మూత్ర, అవయవాల పనితీరు వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారు. గత రెండేళ్ల క్రితం ఈ కేంద్రాన్ని అందుబాలోకి తీసుకువచ్చినా ప్రయోజనం లేకుండా పోతుంది. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన ఈ తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ పరిధిలోకి ఆలూరు, బంట్వారం, బషీరాబాద్, బొంరాస్‌పేట్, చందనవెల్లి, చన్‌గొముల్, చేవెళ్ల, చిట్యాల్, ధారూరు, దోమ పీహెచ్‌సీలతో పాటు కొడంగల్ సీహెచ్‌సీ, కొడంగల్ పీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే కొందుర్గు, కోట్‌పల్లి, కుల్కచర్ల, మర్పల్లి, మొయినాబాద్, మోమిన్‌పేట్, నాగసముద్ర, నవల్గా పీహెచ్‌సీలు, పరిగిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తో పాటు పెద్దేముల్ పీహెచ్‌సీ, పూడూరు, రామయ్యగూడ, షాబాద్, శంకర్‌పల్లి, సిద్దులూరు పీహెచ్‌సీలు ఉన్నాయి. తాండూరు డీహెచ్‌తో పాటు యూపీహెచ్‌సీ, తాండూరు ఎంసీహెచ్, తాండూరు పీహెచ్‌సీ, వికారాబాద్‌లోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్, అలాగే యుపీహెచ్‌సి ఉన్నారు. యాలాల పీహెచ్‌సీ, తాండూరు, వికారాబాద్, కొడంగల్‌లోని బస్తీదవాఖానాలు తెలంగాణ డయోగ్నస్టిక్ హబ్ పరిధిలో ఉన్నాయి. రెండు జిల్లాల్లో 40 ప్రభుత్వ ఆసుపత్రులను ఈ ల్యాబ్‌కు అనుసంధానం చేశారు. ఈ సెంటర్‌లో ఒకే సారి రక్త, మూత్ర, అవయవ

- మిగతా 8వ పేజీలో..



వికారాబాద్‌లోని రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రం

భూములిచ్చిన రైతులకు రూ. 20 లక్షలు, ఇంటిస్థలం, ఉద్యోగం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్/కొడంగల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్ కోసం అసైన్డ్ భూములకు సంబంధించి దుద్యాల మండలం పోలేపల్లి రైతులతో కలెక్టర్ ప్రతీక్‌జైన్ చర్చించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశానికి 34 మంది రైతులు హాజరయ్యారు. పోలేపల్లిలో 73.39 ఎకరాలు ఉందని, దీనిపై రైతుల సమ్మతి పొందినట్లు తెలిపారు. బాధిత రైతులకు ఎకరానికి రూ.20 లక్షలు, 150 గజాల ఇంటి స్థలంలో ఇందిరమ్మ ఇల్లు, ఇంటికి ఒక ఉద్యోగం కల్పించనున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ లింగ్యానాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, టీజీఐసీ జోనల్ మేనేజర్ శైల, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ అజీమ సుల్తానా, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామ్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, దుద్యాల తహసీల్దార్ కిషన్ పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలి

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శనివారం రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రేషన్ కార్డుల జారీపై సంబంధిత శాఖల అధికారులతో ఆన్‌లైన్‌లో సమీక్ష నిర్వహించారు. అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేసి ఆదివారం మధ్యాహ్నంలోగా నివేదికలు రూపొందించాలన్నారు.

అమ్మ తిట్టిందని కూతురు ఆత్మహత్య

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కుట్టుమిషన్ సూది విరిగినందుకు అమ్మ తిట్టిందని ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పోచారం ఐటీకారిడార్‌లో చోటుచేసుకుంది. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏపీలోని ప్రకాశం జిల్లా తర్లపాడు మండలం కేతగుడిపి గ్రామానికి చెందిన డోలు కోటయ్య, కవిత దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు. మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ వెంకటాద్రిటౌన్‌షిప్‌లో ఉంటున్నారు. కూతురు కావ్య(15) చదువు మానేసి ఇంట్లోనే కుట్టుమిషన్ వర్క్ చేస్తుంది. శుక్రవారం సాయంత్రం కావ్య మిషన్ కుడుతుండగా సూది విరగడంతో తల్లి తిట్టింది. దీంతో మనస్తాపానికి గురై శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో బెడ్‌రూంలోకి వెళ్లి చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలిక మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీలు.. కంపుకంపు

- తాండూరు మున్సిపల్‌లో పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు

8

శ్రీవిష్ణుశివాలయంలో ప్రత్యేక పూజలు

మూడుచింతలపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్ధెమర్రి గ్రామ పరిధిలో ఉన్న శ్రీ విష్ణుశివాలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టేకుల కమలమ్మ హన్మంత్‌రెడ్డిలు ఘనంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ బలోపేతానికి అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ అన్నారు. శనివారం ప్రభుత్వ లెక్చరర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మార్గదర్శనం చేయాల్సిన బాధ్యత అధ్యాపకులదేన్నారు. ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వర్‌రావు, సురేశ్వర స్వామి, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి మంజుల, ఉపాధ్యక్షుడు మల్లినాదప్ప, స్టేట్ కౌన్సిలర్ పండరి, రంగారెడ్డి జిల్లా సంయుక్త కార్యదర్శి బుచ్చయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణం నాలుగు మండలాలకు ప్రధాన కూడలిగా ఉండడంతో ఇక్కడ డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ ఆమనగల్లు మున్సిపల్ అధ్యక్షుడు కర్నాటి విక్రంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఆందోళన నిర్వహించారు. డివిజన్ కార్యాలయం సబ్‌రిజిస్టార్, సబ్‌ట్రెజరీ, ఆర్‌డీవో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ ఈఈ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరుతూ తహల్దారు లలితకు వినతిపత్రమందించారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు నాయకులు చెక్కాల లక్ష్మణ్, చెన్నకేశవులు, కృష్ణయాదవ్, శ్రీ శైలం యాదవ్, గోరేటి నర్సింహ, గరియాదవ్, రాజు, రవి రాథోడ్, నాగిల్లలక్ష్మణ్, అశోక్, అ మర్, సంతోష్ తదితరులున్నారు,

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యం

శామీర్‌పేట, జవనరి 18 (ఆంధ్రజ్యోతి): చదువు పూర్తి చేశాక గొప్ప గొప్ప సంస్థల్లో ఉన్నత ఉద్యోగాలు పొందే విధంగా విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించడమే సిల్వర్ ఓక్స్ ఇంటర్నేషనల్ స్కూల్ లక్ష్యమని డైరెక్టర్ డాక్టర్ సీతామూర్తి అన్నారు. మండలంలోని లాల్‌గడి మలక్‌పేట పరిధిలోని శ్రేష్ఠ రిసార్ట్స్, స్పోర్ట్స్ అకాడమిలో ఆ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ సీతామూర్తి ఆధ్వర్యంలో శుక్ర, శనివారాలు రెండు రోజుల వర్క్ షాపును నిర్వహించారు. రెండో రోజు శనివారం నిర్వహించిన వర్క్‌షాపులో డైరెక్టర్ సీతామూర్తి మాట్లాడుతూ తమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భవిష్యత్‌లో అత్యున్నత స్థాయిలో వివిధ వృత్తుల్లో ఉద్యోగాలను పొంది ఎదిగేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో లీడర్‌షిప్ లక్షణాలను, గొప్పనైపుణ్యతను సాధించేలా మార్పులను తీసుకురావాలన్నదే తమ ఆశయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలకు చెందిన డైరెక్టర్ ధనంజయ, ప్రిన్సిపాళ్ళు రచనశర్మ, ఉమాదేవి, సునీత, శోభ, కోర్డినేటర్లు పాల్గొన్నారు.

చర్లపల్లి జైలును సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ ప్రతినిధులు

కుషాయిగూడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి జైలు కేంద్ర కారాగారాన్ని శనివారం న్యాయ సేవాధికార సంస్థ అధికార బృందం సందర్శించింది. తెలంగాణ రాష్ట్ర గౌరవ కార్యదర్శి సిహెచ్.పంచాక్షరి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గౌరవ కార్యదర్శి డి.కిరణ్ కుమార్ సెంట్రల్ జైలులో పర్యటించారు. జైలులో ఖైదీలకు అందజేస్తున్న చికిత్సలు, అధునాతన కిచెన్, 'మైనేషన్' బ్రాండ్‌తో తయారు చేస్తున్న వివిధ ఫ్యాక్టరీ ఉత్పత్తులు, నర్సరీ, ఖైదీల బ్యారక్‌లను వారు పరిశీలించారు. తెలంగాణ జైళ్ల శాఖ ఆధ్వర్యంలో జైలులో చేపడుతున్న కార్యక్రమాలను సూపరింటెండెంట్ జి.రామచంద్రం వారికి వివరించారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌లు డి.కాళిదాస్, వి.శశికాంత్, జి.రత్నం, ఇతర అధికార సిబ్బంది వారి వెంట ఉన్నారు.

కమ్మేస్తున్న కాలుష్యం

ఆదిభట్ల, పట్నంలో జనావాసాల మధ్యే పరిశ్రమలు

- విషవాయువులతో విలవిలలాడుతున్న ప్రజలు
- కలుషితమవుతున్న గాలి, భూగర్భ జలాలు
- అనారోగ్యం బారిన పడుతున్న జనం



బొంగులూరు సమీపంలోని ఆయిల్ కంపెనీ నుంచి వస్తున్న పొగ

ఇబ్రహీంపట్నం/ఆదిభట్ల, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): శరవేంగా అభివృద్ధి చెందుతున్న ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. ఈ ప్రాంతాల్లో ఐటీ సంస్థలు, ప్రతిష్టాత్మకమైన ఎన్ఎస్‌జీ, ఆక్టోపస్ తదితర భద్రత సంస్థలు స్థాపించబడ్డాయి. బీడీఎల్ లాంటి రక్షణ సంస్థలు నెలకొల్పబడ్డాయి. ఆదిభట్లలో టీసీఎస్, ఎయిర్‌క్రాఫ్ట్ విడిభాగాల తయారీ యూనిట్, టాటా లాకీడ్ మార్టీన్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టం లాంటి అంతర్జాతీయ సంస్థలు తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ఇంజనీరింగ్, పీజీ కళాశాలలకు ఈ ప్రాంతం కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఫాక్స్‌కాన్, కేన్స్ లాంటి ఎలక్ట్రానిక్స్ కంపెనీలు వచ్చాయి. ఓ రకంగా చూస్తే ఇక్కడి గ్రామాల్లో సైతం పట్టణ వాతావరణం కనిపిస్తుంది. అలాంటిది ఈ ప్రాంతంపై కాలుష్య మేఘాలు కమ్ముకున్నాయి. గాలి కలుషితమై ఇక్కడి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

రోగాల బారిన ప్రజలు

పాతికేళ్ల క్రితం వరకు ఈ ప్రాంతం ప్రశాంతమైన వాతావరణంలో ఉండేది. కర్మన్‌ఘాట్‌తోపాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న రైస్ మిల్లులను జనావాసాలకు దూరంగా తరలించాలని అప్పట్లో ప్రభుత్వ ఆదేశాలతో మిల్లులు ఈ ప్రాంతానికి తరలివచ్చాయి. కాగా అప్పట్లో జనావాసాలకు దూరంగా వీటిని ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పుడు కాలనీలు విస్తరించడంతో ఇవి జనం మధ్యలో ఉండిపోయాయి. కొన్ని కంపెనీల నుంచి రాత్రి వేళల్లో వచ్చే పొగ భరించడం కష్టంగా ఉంది. కనీసం ఊపిరాడని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతంలో నివసించే ప్రతీ 10 మందిలో ఐదుగురు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. చిన్న పిల్లలు. వృద్ధులు అస్తమా, ఊపిరితిత్తుల సమస్య, ఎలర్జీ, మైగ్రేన్, బీపీ, గుండెపోటు తదితర సమస్యల బారినపడుతున్నారు. జనావాసాల మధ్య నుంచి కంపెనీలు, ఇటుక బట్టీలను తరలించాలని ప్రజలు కాలుష్య వ్యతిరేక పోరాట సమితిగా ఏర్పడి ఆందోళనబాట పడుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఈ ప్రాంతంలో నివసించడం కష్టమని పేర్కొంటున్నారు.

నిత్యం ఇబ్బందులు



జనావాసాల మధ్యలో ఉన్న రైస్ మిల్లులు, ఆయిల్ కంపెనీల నుంచి వెలువడే విషవాయువులతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారు. కంపెనీల నుంచి వచ్చే శబ్ధాలతో రాత్రి వేళ నిద్రపట్టడం లేదు. అధికారులు స్పందించి కంపెనీలను ఇక్కడి నుండి తరలించాలి.

- బొడ్డు రవి, విజయలక్ష్మి కాలనీ, బొంగులూరు


జనావాసాలకు దూరంగా తరలించాలి



కాలుష్యకారక కంపెనీలను జనావాసాలకు దూరంగా తరలించాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కాలుష్యం వెదజల్లే కంపెనీలను ఇక్కడి నుండి షిఫ్ట్ చేయాలని అధికారులకు, ప్రజా ప్రతినిదులకు ఫిర్యాదు చేసి, ఉద్యమాలు చేపట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తాం.

- పయిల్ల తిరుమల్ రెడ్డి, బొంగులూరు

అనేక కంపెనీల ద్వారా..



మంగల్‌పల్లి, పోచారం, ఉప్పరిగూడ, బొంగ్లూరు, శేరిగూడలలో 32 రైస్ మిల్లులు ఉన్నాయి. ఇవి గాక ఎంపీపటేల్ గూడ, రాందాస్‌పల్లి, బొంగ్లూరు, కొంగరకలాన్, శేరిగూడ పరిసరాల్లో ఆయిల్, ఫైవుడ్, ఇటుక బట్టీలు, రెడీమిక్స్ క్రషర్ మిషన్, కురుకురే తదితర కంపెనీలు మరో 40 వరకు ఉన్నాయి. ఈ కంపెనీల నుంచి వెలువడుతున్న విష వాయువులు, కెమికల్ వ్యర్థాలతో గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. ముఖ్యంగా బొంగ్లూర్ సమీపంలోని అంతఃపురం, సప్తగిరి, విజయలక్ష్మి, రాఘవేంద్ర కాలనీలతో పాటు మైహోమ్స్, సీఎంఆర్ మీడోస్, గంగానగర్ కాలనీలతోపాటు శేరిగూడల వద్ద ఉన్న రైస్‌మిల్లుల కారణంగా దుమ్ముధూళి ఇళ్లలోకి చేరి ఆహార పదార్థాలు తినలేని పరిస్థితి నెలకొంది. అంతేగాక ద్విచక్ర వాహనాలు, కాలినడకన వెళ్తున్న వారి కళ్లల్లో దుమ్ముపడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల మధ్య విష వాయువులు వెదజల్లే కంపెనీలను తరలించాలని మున్సిపాలిటీ అధికారులకు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులకు అనేకమార్లు ప్రజలు విన్నవించారు. అయినా స్పందన లేదు. ఈ పరిశ్రమలు కనీస ప్రమాణాలు పాటించకపోవడంతో రోజురోజుకు వాతావరణం కలుషితమవుతోంది. కాలుష్యకారక కంపెనీలను ఇక్కడి నుండి తరలించాలని ప్రజలు రోడ్డెక్కి ఆందోళనలకు దిగుతున్నారు.

ఏకాగ్రతతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



ర్యాలీలో పాల్గొన్న డీఎస్పీ, పోలీస్ సిబ్బంది, ఆర్టీఏ అధికారులు

పరిగి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వాహనాలను నడిపించడంలో ఏకాగ్రత, అవగాహనతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని పరిగి డీఎస్పీ నేతి శ్రీనివాస్ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం పరిగిలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పల్లవి కళాశాలలో జరిగిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. వాహనదారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతుంటాయని చెప్పారు. అతివేగమే ప్రధాన కారణమని తెలిపారు. ఒక సెకన్ నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాల నష్టాలను పూడ్చలేమన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ నడిపించాలని సూచించారు. పరిగి ఎంవీఐ వీరేందర్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రతీ డ్రైవర్ ఆర్టీఏ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏటా ప్రమాదాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగించే విషయమని చెప్పారు. ఇన్సూరెన్స్, లైసెన్స్, ఆర్సీ, ఫిట్‌నెస్ కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖ అధికారి హన్మంత్‌రావు, యువజన సర్వీసుల శాఖ అధికారి ఈశయ్య, ఎస్ఐ సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన కొడంగల్ జట్టు

కొడంగల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం కొడంగల్ పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ కబడ్డీ పోటీలు ముగిశాయి. పోటీల్లో మొత్తం 23జట్లు పాల్గొని హోరా హోరీగా తలపడ్డాయి. శుక్రవారం రాత్రి జరిగిన ఫైనల్ పోటీల్లో కొడంగల్ ఎస్టీ హాస్టల్ జట్టు వర్సెస్ హసేన్‌పూర్ జట్టు తలపడ్డాయి. అందులో కొడంగల్ ఎస్టీ హాస్టల్ బాలుర జట్టు టైటిల్ విజేతగా నిలిచింది. రన్నర్‌గా హసేన్‌పూర్ జట్టు, తృతీయ స్థానంలో అప్పాయిపల్లి జట్టు, 4వ స్థానంలో ముథేల్ జట్టు నిలిచాయి. యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజు చేతుల మీదుగా నిర్వాహకులు విజేత జట్టుకు రూ.30వేలు, రన్నర్‌కు రూ.20వేలు, 3వ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు, 4వ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5వేలు నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు.

వైభవంగా ఊరడమ్మ జాతర



మర్పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూచన్‌పల్లి గ్రామంలో ఊరడమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామ మహిళలు బోనాలతో గ్రామంలోని వీధుల మీదుగా ఊరేగింపు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల నడుమ బోనాలతో ఆలయానికి చేరుకొని ప్రత్యేక నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు బాగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ దేవత ఊరడమ్మకు ఆదివారం అభిషేకంతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముదిరాజ్‌లను బీసీఏలో చేర్చాలి



సాయన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సోదరులు

చేవెళ్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లను ప్రభుత్వం బీసీ- ఏలో చేర్చాలని రాష్ట్ర ముదిరాజ్ సంఘ నాయకుడు డాక్టర్ శివరాజ్ డిమాండు చేశారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చాలని కోరుతూ ఆయన చేపట్టిన బస్సు చైతన్య యాత్ర శనివారం చేవెళ్లకు చేరుకుంది. ఈ సందర్భంగా పండుగల సాయన్న విగ్రహానికి ఆయన పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చుతానని గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అదేవిధంగా ముదిరాజ్ కార్పొరేషన్‌కు రూ2వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ను అమలు చేసి స్థానిక ఎన్నికల్లో పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నర్సింలు, యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు గోపాల్, రాంప్రసాద్, శ్రీనివాస్, గణేష్, కృష్ణమోహన్, నరేష్, శివకుమార్, నవీన్, భార్గవ్, రాజు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగను బెదిరించిన వారిపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్ రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ వర్గీకరణ కోరేవారిని బహిష్కరించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామని, బహిరంగంగా మందకృష్ణ మాదిగను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.నర్సింహ మాదిగ, నాయకులు ఆనంద్ మాదిగ, శ్రావణ్‌కుమార్ మాదిగ, భూషన్ మాదిగ తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల భూములను కాపాడండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన దివ్యాంగులు

కందుకూరు, జనవరి 18(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల భూములను కబ్జాచేసిన వారిని దివ్యాంగుల చట్టం ప్రకారంగా దండించడంతో పాటు వారి భూములు ఇతరులు కబ్జా చేయకుండా చొరవ తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కోర్‌కమిటీ చైర్మన్ గోపాల్‌రావు అధికారులను కోరారు. శనివారం కందుకూరు రెవెన్యూ కార్యాలయం ఎదుట మండల పరిధిలోని దివ్యాంగులతో బైటాయించారు. ఆ యన మాట్లాడుతూ మండలంలోని తిమ్మాయపల్లికి చెందిన గొర్రెంకల యాదయ్య, ఎడ్ల కిష్టయ్యలు అదే గ్రామానికి చెందిన పద్మావతి, హైమావతి, పరమేశ్వరి, రామేశ్వరిలపై దౌర్జన్యం చేసి వారికున్న 9ఎకరాల 16 గుంటల భూమిని కబ్జా చేయడం దారుణమన్నారు. దివ్యాంగులకు న్యాయంచేయడానికి రెవెన్యూ అధికారులు గ్రామంలో విచారణ చేసి వారిని ఆదుకోవాలని కోరారు. మహిళా దివ్యాంగులకు న్యాయం చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ రైతు దీక్ష బూటకం

- పదేళ్లలో తెలంగాణను దోచుకున్న బీఆర్ఎస్
- కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్



రైతుదీక్ష సభ స్థలాన్ని శుభ్రం చేస్తున్న భీంభరత్ తదితరులు

షాబాద్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ షాబాద్‌లో నిర్వహించిన రైతుదీక్ష బూటకమని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. బీఆర్ఎస్ నిర్వహించిన రైతుదీక్ష సభ స్థలాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి శనివారం శుభ్రం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మిగులు బడ్జెట్ కలిగి ఉన్న ప్రత్యేక తెలంగాణను పదేళ్లలో రూ.7లక్షల కోట్లు అప్పుల పాలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. అధికారంలోకి వచ్చిన 13 నెలల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే వంటగ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 60వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీమేరకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశామన్నారు. గతంలో కేసీఆర్ గుట్టలకు, తోటలకు రైతుబంధు వేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26 నుంచి పంట సాగుచేసే రైతుల భూములకు రైతుభరోసా అందజేస్తుందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో చేవెళ్ల డివిజన్‌లో ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు అయినా వచ్చిందా అని ప్రశ్నించారు. చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లో పరిశ్రమల హబ్ పేరిట రైతుల వద్ద గుంజుకొని పెద్ద వారికి ఎక్కువ ధరకు అమ్ముకున్నారని ఆరోపించారు. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన నల్ల చట్టాలకు బీఆర్ఎస్ మద్దతు పలికిందన్నారు. షాబాద్‌లో రైతుదీక్ష ఒక బూటకమని, అక్కడ రైతులు తిరగబడ్డారని, దీక్ష శిబిరానికి వచ్చిన జనాలను డబ్బులు ఇచ్చి తీసుకువచ్చారని అన్నారు. కేటీఆర్ ఈ-ఫార్ములా కేసులో రేపో మాపో జైలుకు పోవడం ఖాయమన్నారు. ఇప్పటి వరకు చేవెళ్ల నియోజకవర్గానికి రూ.8కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి గౌరీసతీష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భార్గవ్ రామ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు, ఏఎంసీ డైరెక్టర్ అక్తర్‌పాష, నాయకులు రాంరెడ్డి, చల్లా మాధవరెడ్డి, పీసరి వెంకట్‌రెడ్డి, అస్మత్‌పాష, పెంటారెడ్డి, అశ్వక్‌అలీ, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

జనరల్‌బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాలమాకుల జంగయ్య

షాబాద్, చేవెళ్ల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): చేవెళ్లలో నిర్వహించే జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో మండల కార్యదర్శి నక్కలి జంగయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ఈనెల 28న చేవెళ్లలోని కేజీఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే జనరల్ బాడీ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశానికి చేవెళ్ల, షాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబ్‌పేట్ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, నాయకులు రాములు, శ్రీశైలం, నారాయణ, రుక్కయ్య, నర్సయ్య ఉన్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

బీజేపీ కిసాన్‌మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్



బీజేపీ మహేశ్వరం మండల అధ్యక్షుడు యాదీష్‌ను సన్మానిస్తున్న నాయకులు

మహేశ్వరం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కష్టపడ్డ ప్రతి కార్యకర్తను బీజేపీ కంటికి రెప్పలా కాపాడుకుంటుందని కిసాన్‌మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ అన్నారు. బీజేపీ మహేశ్వరం మండల అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన తెల్లమల్ల యాదీష్‌ను శనివారం మన్‌సాన్‌పల్లి చౌరస్తాలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారులను అత్యధిక సంఖ్యలో గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మిద్దె సుదర్శన్‌రెడ్డి, అనంతయ్యగౌడ్, యాదయ్యగౌడ్, కాసాని వెంకటేష్‌గౌడ్, సుదర్శన్ యాదవ్, వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, మాదవాచారి, శంకర్, ఉపేందర్ పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి

వికారాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతి ఏడాది సగటున ఐదు లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని జిల్లా రవాణా అధికారి వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్, కళాశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ ధరించడం, కారులో సీట్ బెల్ట్ వాడడం వంటి జాగ్రత్తలు తీసుకుంటే అనేక ప్రాణాలను కాపాడవచ్చన్నారు. పాదాచారులు, డ్రైవర్లు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్‌సిగ్నల్స్ పాటించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంవీఐ జోసఫ్ హాల్ట్, వీరేంద్రనాయక్, సిబ్బంది, వాహనదారులు ప్రజలు పాల్గొన్నారు.

మేడ్చల్ ఏసీపీని కలిసిన బీజేపీ నాయకులు



ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డితో బీజేపీ నాయకులు

మేడ్చల్ టౌన్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నూతనంగా మేడ్చల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్ష పదవి చేపట్టిన శైలజ హరినాథ్ శుక్రవారం మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీకి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం మేడ్చల్ తహసీల్దార్ శైలజను కలిశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, వంశీధర్‌రెడ్డి, లవంగ శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలి




వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, జనవరి 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులు ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయస్థాయిలో రాణించాలని, క్రీడలతో మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ధృడత్వం లభిస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం నందిగామ మండల పరిధిలోని మజీద్ మామిడిపల్లిలో మహబూబ్‌నగర్ వాలీబాల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మొదళ్లగూడ గ్రామానికి చెందిన చీకుర్తి సుదర్శన్ ఆర్థిక సహకారంతో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. సుదర్శన్‌ను ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అభినందించారు. నాయకులు శివశంకర్‌గౌడ్, జంగ నర్సింలు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కావలి కృష్ణ, నవీన్‌గౌడ్, అనిల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, సుదర్శన్, మోహన్‌సింగ్, సుధాకర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చెంగోల్ ఉన్నత పాఠశాలకు మహర్దశ

- ఊరగుట్ట తొలగించి ఆటస్థలం
- రూ.5లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే
- పరిశీలించిన పంచాయతీరాజ్ డీఈ



చెంగోల్ గ్రామ శివారులోని గుట్టను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ నాగభూషణం

తాండూరు రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంగోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మహర్దశ పట్టింది. పాఠశాలకు ఆట స్థలం కోసం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నిధులు మంజూరు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. చెంగోల్ ఉన్నత పాఠశాలకు ఆటస్థలం లేక విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు. అయితే ఈ విషయాన్ని గ్రామస్తులు పలుమార్లు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో పలువురు ప్రస్తుత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి ఆటస్థలం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు గ్రామ శివారులోని ఊరగుట్టను ఆటస్థలంగా మార్చేందుకు నిర్ణయించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఊరగుట్టను తొలచేందుకు రూ.5లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో శనివారం పంచాయతీరాజ్ డీఈ నాగభూషణం చెంగోల్ ఊరగుట్టను పరిశీలించారు. గుట్ట ఎంత ఎత్తులో ఉందని, తొలగింపు చర్యలపై గ్రామస్తులను కలిసి మాట్లాడారు. పాఠశాలకు ఆట స్థలం ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారుల వెంట పంచాయతీ నాయకులు రాము యాదవ్, బలరాం ఉన్నారు.

అర్హులు ఎందరో!

(5వ పేజీ తరువాయి)

అర్హులను ఎంపిక చేశారు. ఈ జాబితా ఆధారంగా ఈనెల 16 నుంచి క్షేత్రస్థాయిలో అర్హుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికి వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లోని వారికి రూ.2 లక్షల లోపు ఉంటే అర్హతగా నిర్ణయించారు. మాగాణి(తరి) 3.5 ఎకరాలు, మెట్ట 7 ఎకరాల వరకు ఉండవచ్చని నిబంధన విధించారు. దరఖాస్తుదారుడి పేరిట కారు ఉంటే నమోదు చేయాలని సూచించగా, వ్యవసాయ ట్రాక్టర్లు, వ్యవసాయ వాహనాలకు మినహాయింపు ఇచ్చారు.

గ్రామ, వార్డు సభల్లో అర్హుల ఎంపిక

జిల్లాలో కొత్తరేషన్ కార్డుల జారీకి నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి పరిశీలన శనివారం వరకు 74 శాతం పూర్తయింది. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తుల్లో ప్రాథమికంగా 23,542 దరఖాస్తులను అర్హత ఉన్నట్లుగా గుర్తించారు. వాటిలో 17,492 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అర్హుల జాబితాలను ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ, వార్డు సభల్లో ప్రదర్శించనున్నారు. అక్కడ అర్హులను ఎంపిక చేయనున్నారు. కొత్త రేషన్ కార్డులకు అర్హులుగా ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను ఎంపీడీవోలు ఈనెల 25న కలెక్టర్ లాగిన్ నుంచి కమిషనర్‌కు అప్‌లోడ్ చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ఆమోదం పొందిన తర్వాత లబ్ధిదారుల జాబితా కలెక్టర్ లాగిన్‌కు పంపించనున్నారు. ఈనెల 26న కొత్త కార్డులను అందజేస్తారు.

మండలాల వారీగా దరఖాస్తుల వివరాలు

కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు 23,542 దరఖాస్తులను క్షేత్ర స్థాయి పరిశీలనకు ఎంపిక చేశారు. వికారాబాద్ మండలంలో 682 దరఖాస్తులు, ధారూరులో 1,125, మర్పల్లిలో 1,208, మోమిన్‌పేట్‌లో 12, బంట్వారంలో 484, కోట్‌పల్లిలో 734, నవాబ్‌పేట్‌లో 794 దరఖాస్తులపై పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పరిశీలన కొనసాగిస్తున్నారు. పరిగి మండలంలో 1,501, కులకచర్లలో 1,088, పూడూరులో 1,066, దోమలో 1,175 దరఖాస్తులు, కొడంగల్‌లో 1,068, దౌల్తాబాద్‌లో 1,396, బొంరాస్‌పేట్‌లో 960, దుద్యాల్‌లో 629 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. తాండూరులో 1,546, బషీరాబాద్‌లో 1,506, యాలాలలో 1,202, పెద్దేముల్‌లో 1,491, చౌడాపూర్‌లో 697దరఖాస్తులపై పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. మున్సిపాలిటీలైన తాండూరులో 1,193, వికారాబాద్‌లో 901, పరిగిలో 406, కొడంగల్‌లో 294 దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది.

మంత్రి ప్రకటనతో చిగురించిన ఆశలు

ఆరేళ్లుగా కొత్త కార్డుల జారీ నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌రెడ్డి పాత రేషన్ కార్డులు తొలిగించమని, కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చేలా చర్యలు తీసుకుంటామని శనివారం ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురించాయి.

కాలనీలు.. కంపు కంపు

- మురుగు కాల్వల్లో చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న కాలనీవాసులు
- పట్టించుకోని మున్సిపల్ సిబ్బంది



తాండూరులో చెత్తా చెదారంతో నిండిన మురుగు కాల్వలు

తాండూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): దుర్గంధంతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. మురుగునీటి కాల్వనిండి నెలరోజులవుతున్నా పట్టించుకోకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మున్సిపల్ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. మురుగుకాల్వ చెత్తాచెదారంతో నిండి ప్రవాహం నిలిచిపోయింది. తాండూరు పట్టణం భవానీనగర్‌లోని పలు కాలనీల్లో ప్రధాన రోడ్డును అనుకొని ఉన్న రాయల్ కంట వద్ద, బీసీ కళాశాల విద్యార్థుల హాస్టల్ వద్ద, దర్గా ప్రాంతంలో, రాజీవ్‌కాలనీలో మురుగు కాల్వలు నిండి పోయాయి. దీంతో ఈగలు, దోమలతో రోగాలపాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజీవ్‌కాలనీలో మురుగు నీరు ఏకంగా కిలోమీటర్ మేర పోరతోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాల్వను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.



రాజీవ్‌కాలనీలో పారుతున్న మురుగు

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మర్పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓవ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మర్పల్లి శివారులో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బూచన్‌పల్లికి చెందిన శిలాపూరం శ్రీకాంత్(25) వ్యవసాయ కూలీగా జీవనం కొనసాగించేవాడు. మర్పల్లి శివారులో శనివారం రాత్రి గుర్తుతెలియని డీసీఎం వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు శ్రీకాంత్‌ను 108 వాహనంలో మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి, అక్కడి నుంచి సంగారెడ్డి జిల్లా సదాశివపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

కుక్కల దాడిలో లేగదూడ మృత్యువాత

పరిగి రూరల్, జనవరి 18, (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో లేగదూడ మృత్యువాతపడింది. ఈ ఘటన పరిగి మండలంలోని సయ్యద్‌పల్లిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బి.యాదయ్య రైతు పొలంలో వద్ద పశువుల పాకలో ఉదయం కుక్కలు రెండు లేగదూడలపై దాడి చేశాయి. దీంతో ఒక లేగదూడ మృత్యువాతపడగా మరో లేగదూడకు తీవ్రగాయాలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోందని బాధిత రైతు తెలిపాడు. ఇటీవలే రూ.2లక్షలు వెచ్చించి రెండు ఆవులను తెచ్చానని, లేగదూడ మృతితో ఆవు పాలు ఇవ్వడంలేదని వాపోయాడు. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వల్లే కుక్కలు తన లేగదూడలపై దాడి చేశాయని ఆరోపించాడు. గ్రామంలో చెత్త డంపింగ్ యార్డు ఉండగా అక్కడ చెత్త వేయకుండా తన పొలాల వద్ద చెత్త డంపింగ్ చేస్తున్నారని వాపోయాడు. ఫిర్యాదు చేస్తే దురుసుగా సమాధానమిస్తున్నట్లు వాపోయాడు.ఉన్నతాధికారులు స్పందించి న్యాయంచేయాలని వేడుకున్నాడు.

చెత్త తరలిస్తున్న లారీ దగ్ధం



మంటల్లో తగలబడుతున్న చెత్త లారీ

కీసర రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి చెత్త తరలిస్తున్న లారీ దగ్ధమైంది. ఈ ఘటన శనివారం కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వివరాల ప్రకారం జీహెచ్‌ఎంసీకి చెందిన లారీలో నగరం నుంచి చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో చెత్త లోడ్‌తో ఉన్న లారీ దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడ వద్దకు చేరుకోగా లారీ క్యాబిన్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ సతీష్ లారీని పక్కకు నిలిపి కిందకు దిగాడు. అనంతరం మంటలు పెద్దఎత్తున చెలరేగి, క్యాబిన్ పూర్తిగా తగలబడి పోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న క్షేత్ర పరిశీలన



తాండూరు రూరల్: బెల్కటూర్‌లో భూములను పరిశీలిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

కొడంగల్ రూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియపై కొడంగల్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లోని గ్రామాల్లో శనివారం అధికారుల క్షేత్ర పరిశీలన కొనసాగింది. అర్హులను గుర్తించేందుకు రెవెన్యూ, వ్యవసాయశాఖ, ఈజీఎస్, పంచాయితీ సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారు. సర్వే ఈ నెల 20వరకు కొనసాగుతుందని, 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొనారు.

బొంరాస్‌పేట్: మండలంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తయింది. ఈనెల 26న ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనుండటంతో శనివారం ఎంపీడీవో కార్యాలయం సమీపంలో నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం హౌసింగ్ డిప్యూటీ డీఈ మూడవత్ చందర్, ఎంపీడీవో వెంకన్‌గౌడ్ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట సీనియర్ అసిస్టెంట్ గోపాలకృష్ణ ఉన్నారు.

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్ తహసీల్దార్ మనోహర చక్రవర్తి రెవెన్యూ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో సర్వే నిర్వహించారు. ఆన్‌లైన్‌లో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల వివరాలను సిబ్బంది సేకరించారు. రైతు భరోసా కోసం వ్యవసాయ యోగ్యం కాని భూములను మండలంలోని కేసారంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీడీవో విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి జయశంకర్, ఎంపీవో యాదగిరి సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఆర్‌ఐ గోవర్ధన్, సరి, ఏఈవో పెంటయ్య, సర్వేయర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరిగి: వ్యవసాయేతర భూముల వివరాలు సేకరిస్తున్నట్లు పరిగి మండల తహసీల్దార్ ఎం.ఆనంద్‌రావు తెలిపారు. రైతు భరోసా అమలులో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో శనివారం తహసీల్దార్‌తోపాటు, వేర్వేరు బృందాలు క్షేత్రస్థాయిలో భూములు, వాటికి సంబంధించిన పట్టాపుస్తకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో రజిత, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాస్, నవీన్‌రెడ్డి, ఆర్‌ఐలు, ఏఈవోలు పాల్గొన్నారు.

దోమ: మండలంలోని రాకొండలో శనివారం కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో మహేశ్‌బాబు పరిశీలించారు. అర్హులైన వారి వివరాలను పారదర్శకంగా సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నర్సింహులు, అధికారులు పాల్గొన్నారు. రాకొండలో డిప్యూటీ తహసీల్దార్ నర్సిములు ఆధ్వర్యంలో సాగులో ఉన్న భూములు, వ్యవసాయేతర భూములను పరిశీలించారు. ఏఈవో శ్రవణ్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్: మండలంలోని బెల్కటూర్ క్లస్టర్‌లో జరుగుతున్న సర్వేను తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్‌తో కలిసి తహసీల్దార్ తారాసింగ్ పర్యవేక్షించారు. మండలంలోని అంతారం, బెల్కటూర్, కరన్‌కోట్, చెంగోల్, నారాయణపూర్, కోటబాస్పల్లి, సిరిగిరిపేట్ క్లస్టర్లలో రైతు భరోసా సర్వే కొనసాగుతోందని తాండూరు వ్యవసాయాధికారి కొమరయ్య అధికారులకు వివరించారు. బెల్కటూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్-275లో ఆరీఫొద్దీన్‌కు సంబంధించిన 1 ఎకరా 20గుంటల భూమి సర్వేకు యోగ్యం కాని భూమి అని సర్వే అధికారుల బృందం నిర్ధారించింది. మండల పరిధిలో 34వేల 765 ఎకరాల భూమికి గతంలో రైతు భరోసా వచ్చేదని, ప్రస్తుతం సాగుకు యోగ్యం కాని భూముల వల్ల తగ్గే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ సందీప్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

బషీరాబాద్: వ్యవసాయేతర భూముల సర్వేలో భాగంగా శనివారం వరకు 150 ఎకరాలు సాగుకు యోగ్యంగా లేనివి గుర్తించినట్లు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ తెలిపారు. మండలంలోని కొర్విచెడ్ గ్రామశివారులో శనివారం వ్యవసాయనికి యోగ్యంగా లేని భూములను ఆయన స్వయంగా పరిశీలించారు. మండల వ్యాప్తంగా జీవన్గి, క్యాద్గీరా, కొర్విచెడ్, మాసన్‌పల్లి, నవాల్గ, ఎక్మాయి గ్రామ శివారుల్లోని భూముల్లో నాపరాళ్లగనుల తవ్వకాలు జరుపగా సాగుకు యోగ్యంగా లేవన్నారు. ఆయా గ్రామాల పరిధిలో రెవెన్యూ అధికారులు, సర్వేయర్‌తో కలిసి నిబంధనల ప్రకారం క్షేత్ర స్థాయిలో భూముల వివరాలు సేకరిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా రెడ్డిఘణాపూర్ శివారులోని రెండు ఫాంహౌస్‌లలో 25 గుంటల భూమి సాగు యోగ్యంగా లేదని, వివరాలు సేకరించినట్లు తెలిపారు. సర్వేలో సీనియర్ అసిస్టెంటు వెంకటేశం, సర్వేయర్ ప్రభుకుమార్ పాల్గొన్నారు.

కొడంగల్: మండలంలోని రుద్రారం గ్రామంలో రెవెన్యూ అధికారులు రాజేందర్‌రెడ్డి, రాఘవేందర్‌రావు, వ్యవసాయ శాఖ ఏఈవోలు శ్రీపతిరెడ్డి, ఐజాక్ హెరాల్డ్ సాగులో ఉన్న భూములు, వ్యవసాయానికి యోగ్యం కాని భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి గ్రామసభలు

శామీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పథకాలపై ఈ నెల 21 నుంచి 24 వరకు శామీర్‌పేట మండలంలో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మమతాబాయి తెలిపారు. శనివారం ఆమె మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్తరేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలపై లబ్ధిదారుల ఎంపిక కోసం పంచాయతీల వారిగా గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వివరించారు.

ఆలయ భూమి వెలుగులోకి..

కులకచర్ల: వ్యవసాయేతర భూముల సర్వేలో రాకంచర్ల శ్రీ లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయానికి భూమి ఉన్న సంగతి వెలుగులోకి వచ్చింది. గ్రామ పరిధిలోని సర్వే నెం.88లో 22 గుంటల భూమి పూడూరు మండలం రాకంచర్ల శ్రీ లక్ష్మీ నర్సింహాస్వామి ఆలయానికి చెందినదిగా ధరణిలో ఉంది. అయితే ఇట్టి భూమికి డిజిటల్ సైన్ కాలేదు. రైతుబంధు మంజూరు కాలేదు. ఈమేరకు డిజిటల్ సైన్ ఎందుకు పెండింగ్‌లో ఉంది? రైతు బంధు ఎందుకు పొందలేదనే విషయాలపై రెవెన్యూ అధికారులు విచారణ చేపడుతున్నారు. అయితే ఆలయానికి భూమి ఉన్నట్లు దేవాదాయ శాఖ అధికారులకు తెలియకపోవడం గమనార్హం.

సంక్షిప్తంగా..

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాజుగౌడ్

ఘట్‌కేసర్ రూరల్: బీజేపీ మండల అధ్యక్షుడిగా బసవ రాజుగౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్, జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్‌లకు రాజుగౌడ్ కృతజ్ఞతలు తెలిపాడు.

ముదిరాజ్ సంఘం సమన్వయకర్తగా వెంకటయ్యముదిరాజ్

పరిగి: ముదిరాజ్ సంఘం పరిగి నియోజకవర్గం సమన్వయకర్తగా కులకచర్ల మండలం తీర్మాలాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కావలి వెంకటయ్యముదిరాజ్ నియమితులయ్యారు. సంఘం తాలుకా అధ్యక్షుడు టి.రామస్వామి నియామక పత్రాన్ని అందజేశారు.

మానవ అక్రమ రవాణా నేరం

పరిగి: మానవ అక్రమ రవాణా నేరమని మిట్టకోడూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శరత్‌బాబు అన్నారు. ఏహెచ్‌టీవో బృందం ఆధ్వర్యంలో శనివారం పరిగి మండలం మిట్టకోడూరు ఉన్నత పాఠశాలలో 'మానవ అక్రమ రవాణాను అరికట్టుకుందాం' అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

తాండూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలు నియంత్రించవచ్చని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ-కర్ణాటక సరిహద్దులో గల కొత్లాపూర్, మల్కాపూర్, సంగెంకలాన్ గ్రామాలతోపాటు కోటబాస్పల్లి, జినుగుర్తి, ఉద్దండాపూర్, అల్లాపూర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొడంగల్: కొడంగల్ పట్టణ శివారులోని సిద్దనొంపు ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం హిందూ వాహిని సభ్యులు, శివస్వాములు ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాకేశ్, అరుణ్, రవికుమార్, శివస్వాములు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

దుద్యాల: ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలులో చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని బీజేపీ నాయకులు ఆరోపించారు. శనివారం వారు దుద్యాలలో విలేకరులతో మాట్లాడుతూ నేటి వరకు రైతు భరోసా ఇవ్వలేదని, రుణమాఫీ చాలా మందికి పూర్తిస్థాయిలో కాలేదని ఆరోపించారు. ఈ సమావేశంలో రాములు, శ్రీకాంత్, మణికంఠగౌడ్ పాల్గొన్నారు.

త్వరలో మహిళా సంఘాల నూతన కమిటీలు

కోట్‌పల్లి: త్వరలో మహిళా సంఘాల నూతన గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ఏపీఎం శివయ్య తెలిపారు. మండలంలోని బుగ్గాపురం ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో 24మంది గ్రామ సంఘాల అధ్యక్షులతో మాట్లాడారు. ఈ సమావేశంలో సీసీ గణేష్ ఉన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

మోమిన్‌పేట్: మండల కేంద్రంలో బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో శనివారం ప్రధాని నరేంద్రమోదీ, ఎంపీ ధర్మపురి అరవింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. తెలంగాణకు పసుపు బోర్డు రావడంతో రైతులతో కలిసి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆశిరెడ్డి, రాజిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి

మోమిన్‌పేట్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నర్సింహులు అన్నారు. మండలంలోని ఎన్కెపల్లిలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశానుసారం రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్లయ్య, బుచ్చిరెడ్డి, విఠల్‌రెడ్డి, రామయ్య, దుర్గయ్య, సురేందర్, వినోద్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

యాలాల: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రత్యేక నిధులు రూ.15లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. యాలాల మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులను హనుమాన్ దేవాలయం నుంచి చవిడి వరకు సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆప్షన్ల సంఘం మాజీ అధ్యక్షుడు అక్బర్ బాబా, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనివాస్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాపోల్ నాగయ్య పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కీసర: ప్రభుత్వ భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కీసర బంగారు మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు శనివారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రం కీసరలో సర్వే నంబర్ 362లో గల ప్రభుత్వ భూమిలో రాంపల్లి దాయరకు చెందిన వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని కీసర బంగారు మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు తహసీల్దార్ అశోక్‌కు ఫిర్యాదు చేశారు.

గుండెపోటుతో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మృతి

ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గూడెపు ఆంజనేయులు(75)శనివారం గుండెపోటుతో మృతిచెందాడు. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ రామిరెడ్డి, మాజీఎంపీపీ సుదర్శన్‌రెడ్డి నివాళులర్పించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న నాయకులు

పూడూరు, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవనోనిగూడెంలో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిన్న నారాయణ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గ్రామానికి చెందినగోవ నర్సింహులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ గోపాల్

వికారాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు చేయూతనివ్వాలని కౌన్సిలర్ గోపాల్ అన్నారు. మద్గుల్ చిట్టంపల్లిలో జాపర్పల్లి రాములు విజయలక్ష్మి దంపతుల కుమార్తె చైత్ర(ప్రిన్సీ) జన్మదిన సందర్భంగా గ్రామంలోని హైస్కూల్ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్, పాండు, సంతోష నర్సింహులు, చాకలి మల్లయ్య, ఈశ్వర్, పాండు, లాలయ్య, అంజయ్య, యాదయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, వెంకట్, రాజు, దాసు, శింబు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరువలేనివి



వికారాబాద్: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ పేదల సంక్షేమానికి చేసిన సేవలు మరువలేనివని పరిగి మాజీ జడ్పీటీసీ పి.చంద్రయ్య అన్నారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం పరిగిలోని ఆయన స్వగృహంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పరిగి, కులకచర్ల, పూడూరు మండలాల పార్టీ నాయకులు సి.నర్సిరెడ్డి, కె.వెంకటయ్య, ఎం.అనంతరెడ్డి, చిన్నయ్య, బాలరాజు, రాములు, నాగప్ప, రాంచందర్, సిద్దు పాల్గొన్నారు.

వికారాబాద్: పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్ట వెంకటేశ్ గౌడ్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తిరుమల తిరుపతి దేవస్థానంలో రాయల కాలంలో ఉన్న నిత్యాన్నదాన పథకాన్ని మే 1985 సంవత్సరంలో ఎన్టీఆర్ పునరుద్ధరించారని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆశ్రమ గురుకుల పాఠశాలలు నెలకొల్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నర్సింహా, కాంతారావు, శ్రీహరియాదవ్, గౌతమ్, ధర్మయ్య పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: ఎన్టీఆర్ వర్ధంతిని శనివారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు వివిధ పార్టీల నాయకులు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వాసు, శేఖర్‌చారి, సుధాకర్, భాస్కర్, రాంబాబు, మౌలాన, కృష్ణ రెడ్డి, శ్రీనివాస్, శ్రీపాల్ గౌడ్, రాజేష్ సురేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కీసర రూరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అని నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీలో శనివారం టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మల్లేష్‌యాదవ్, కొత్త రామారావు, కొండా జంగారెడ్డి, రాములుయాదవ్, రాంచందర్‌గౌడ్, సతీష్‌బాబు పాల్గొన్నారు.



మేడ్చల్ టౌన్: ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

121వ సారి రక్తదానం

ఘట్‌కేసర్: ఒకసారి కాదు రెండుసార్లు కాదు ఏకంగా 121వసారి రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచాడు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌కు చెందిన సిస్టా సూర్యనారాయణ అలియాస్ బొట్టుసూరి. ఎవరికి రక్తం అవసరమైనా నేనున్నానని ముందుకు వచ్చి రక్తం ఇచ్చే సూర్యనారాయణ శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 121వ సారి రక్తదానం చేశాడు. ఈసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మంగళగిరిలోని టీడీపీ పార్టీ కార్యాలయంలో జరిగిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశాడు. ఆయనను మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు, టీడీపీ నాయకులు అభినందించి రక్తదాత సర్టిఫికెట్‌ను అందజేశారు.



121వసారి రక్తదానం చేస్తున్న సూర్యనారాయణ

రోగ నిర్ధారణకు పరీక్ష!

(5వ పేజీ తరువాయి)

పనితీరు, థైరాయిడ్, లివర్, కిడ్నీ పనితీరు, కొలెస్ట్రాల్, చికున్‌గున్యా, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, క్యాల్షియం, సీరమ్ క్రియటినైన్, డీహెచ్‌డీఎల్, ఎలక్ట్రోరేట్స్, హెచ్‌బీఎస్‌హెచ్‌జీ వంటి 57 రకాల పరీక్షలు చేస్తారు. వీటితో పాటు ఖర్చుతో కూడుకున్న టీస్కాన్, 2డీ ఈకో, అల్ట్రాసౌండ్, మ్యామోగ్రఫి లాంటి స్కానింగ్ పరీక్షలు కూడ నిర్వహిస్తారు. ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి నమూనాలను జిల్లా కేంద్రాలోకి డయాగ్నోస్టిక్ సెంటర్‌కు చేరవేసేందుకు ప్రత్యేక వాహన వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లాలో దూరాన్నిబట్టి ఒకటి, రెండు లేదా మూడు రూట్లుగా విభజించారు. ప్రతి రోజు జిల్లా కేంద్రం నుంచి బయలు దేరి పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నుంచి నమూనాలను ఐస్‌బాక్స్‌లో పెట్టుకుని తిరిగి మధ్యాహ్నం వరకు ల్యాబ్‌కు చేరుకుంటారు. ఆన్‌లైన్‌లో రోగి పేరు, బార్‌కోడ్, వివరాలు నమోదు చేస్తారు. ఆ నమూనాలను జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ కేంద్రానికి చేరుస్తారు. అన్ని ఆసుపత్రుల నుంచి తీసుకు వచ్చిన నమూనాలను పరీక్ష చేసి నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపర్చుతారు. ఆయా పీహెచ్‌సీలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ప్రింట్ తీసి రోగికి అందజేస్తారు. కానీ.. గత 12 రోజుల నుంచి ఆన్‌లైన్‌లో నివేదికలు రావడం లేదు. రక్త నమూనాలు ఇచ్చిన రోగులంతా రోజు టెస్ట్ రిపోర్ట్స్ కోసం ఎదురు చేస్తున్నారు. రక్త పరీక్షల ఫలితాలు రావడంలో తీవ్ర జాప్యం జరుగుతుండటతో రోగుల రోగం కాస్త ముంది ప్రాణాలు పోయే దుస్థితి ఏర్పడుతుంది. రక్త పరీక్షల ఫలితాల కోసం ఎదురుచూసి చివరకు కొందరు రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. డబ్బు లేని నిరుపేదలకు మాత్రం అవస్థలు తప్పడం లేదు. తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ లేక ముందు స్థానికంగా ప్రభుత్వ ఆసుపత్రిలోనే కొన్ని రకాల పరీక్షలు జరిగేవంటున్నారు.

వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన ఈ తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌లో యంత్రాలు పాడవడంతో 12 రోజుల నుంచి టెస్టులు నిలిచిపోయాయి. ఒక్కో పీహెచ్‌సీ, బస్తీదవఖానాల నుంచి రోజుకు 20-30 నమూనాలు, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌నుంచి రోకు 40-55 రక్తనమూనాలు వెళ్లేవి. డయోగ్నస్టిక్ సెంటర్‌లో యంత్రాలు పాడవడంతో వందలాది మంది రోగులు రక్త పరీక్షలకు ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. చేవెళ్ల, వికారాబాద్, పరిగిలో డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయి. మూడు షిఫ్టుల్లో రోజుకు 15 మంది ఒక్కో సెంటర్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. కానీ.. డయాలసిస్ చేయాలంటే.. ముందుగా సీబీపీ, ఆర్‌ఎఫ్‌టి, ఎల్‌ఎఫ్‌టి రక్తపరీక్షలు తప్పనిసరి. ఈ పరీక్షలు చేశాక వచ్చిన రిపోర్టు ఆధారంగా డయాలసిస్ చేస్తారు. కానీ.. సీబీపీ, ఆర్‌ఎఫ్‌టీ, ఎల్‌ఎఫ్‌టీ రక్తపరీక్షలు ప్రైవేట్‌లో రూ. 1500 చెల్లించి చేయించుకుంటున్నారు. ప్రస్తుతం తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో థైరాయిడ్ టెస్టు మినహా ఏ ఒక్క టెస్టు చేయడం లేదు. గత 12 రోజుల నుంచి రక్తనమూనాలు ఎందుకు తీసుకోవడం లేదనే విషయాన్ని వికారాబాద్‌లోని తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ మేనేజర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. మిషన్ పనిచేస్తుందని చెప్పారు. వెంటనే చేవెళ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న టెక్నీషియన్‌కు ఫోన్ చేయగా.. బయో కెమిస్ట్రి శాంపిల్ తీసుకోవడం లేదని, మిషన్ పనిచేయడం లేదని చెప్పారు. రక్త పరీక్షల్లో ఆర్‌ఎఫ్‌టీ, టీఎఫ్‌టీ రావడం లేదని తెలిపారు.